


# చీకటిలో వెన్నెల

— ఆకెళ్ళ
వెంకట సూర్యనారాయణ

ఆ బ్యాగు తీసుకొని వరండాలోకి వచ్చాను. వాళ్ళు వెళ్ళిపోతున్నారు. వరండాలో నిలబడ్డ నాకు వాళ్ళ గుసగుసలు వినిపిస్తున్నాయి. అలవాటుగా నాన్న వాళ్ళ వెనక చేతులు కట్టుకొని నడుస్తున్నాడు. నాన్నని అలా చాలాసార్లు చూసాను. మా స్కూలుకి ఇనస్పెక్టర్లు, డి.యి.ఓ.లు వచ్చినపుడు అలాగే నడిచే వాడు. రిటైరయిన తర్వాత నా కోసం పెళ్ళివారు వచ్చినపుడల్లా అలాగే చేతులు వెనుక కట్టుకొని ఇప్పటికి పదిసార్లుపైగా నడిచాడు. పదిసార్లు పెళ్ళివారు రాసిన సమాధానం చదివి పోష్టాఫీసునించి చేతులు కట్టుకొని నీరసంగానే తిరిగి వచ్చాడు.

నాకు కూడా పెళ్ళివారు వచ్చినపుడల్లా వరండాలో నిలబడి చూడటం అలవాటుఅయిపోయింది. పెళ్ళికొడుకుని మరోసారి చూడటానికి మాత్రం కాదు- మా అమ్మ గురించి మోహం చాటు వేయడానికే సావిట్లోంచి వరండాలోకి వస్తుంటాను.

ఈ పెళ్ళి చూపుల నాటిక అయిన తర్వాత మానసికంగా మా అమ్మ ఒకటి రెండు రోజులు క్రుంగిపోతుందని నాకు తెలుసు. మా అమ్మ దృష్టి, నా దృష్టి, నాన్న దృష్టి ఒక విషయం మీదనే ఉంటుంది. ఆ విషయం గూర్చి మేము మాట్లాడుకోము. సంవత్సరాలు తిరిగినా మేము మర్చిపోలేని సంఘ

టన. కాని మేము ముగ్గురం మర్చి పోయినట్లు నటిస్తున్నాము. గొప్పగా నటిస్తున్నాము. మా బాధలు, కన్నీళ్ళకు మూలమయిన ఆ సంఘటన గూర్చి చర్చించుకోవడానికి కూడా ఇష్టపడము. కారణం చర్చించుకొన్నా పరిష్కారం లేదు కనుక.

ప్రొద్దున పెళ్ళివారు వస్తున్నపుడు నాన్న- "ఈ సంబంధం కుదిరితే సుశీల అదృష్టవంతురాలు. కుర్రాడు కాలేజీ లెక్చరర్. బరువు బాధ్యతలు లేవు. ఉన్న ఒక్క చెల్లెలుకు పెళ్ళి అయిపోయింది" అంటూ వాళ్ళ గురించి ఏకరువు పెడుతూ, సోఫాలు, కుర్చీలు సర్దుతూ హడావిడి పడిపోయాడు.

పెళ్ళివారిని నాన్న రైలుస్టేషన్‌కి వెళ్ళి తిన్నగా ఇంటికి తీసుకు వచ్చాడు. మా గురించి ముఖ్యంగా ఆ సంఘటన గూర్చి వీళ్ళకు ఏమీ తెలియదు. 'అలాగే తెలియకుండా ఉంచు భగవంతుడా!' అంటూ నేను వేయి దేవుళ్ళకి మొక్కుకున్నాను.

పెళ్ళికొడుకు కాక, పెళ్ళికొడుకు తల్లి, తండ్రి, చెల్లెలు వచ్చారు. అమ్మవాళ్ళని పలకరించి స్నానాలు, కాఫీలు ఏర్పాటు చేసింది. నాన్నగారు, పెళ్ళికొడుకు తండ్రి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటల మధ్య గంభీరమైన గొంతు వినిపిస్తోంది. కంఠం బాగానే ఉంది. 'అతను ఎలా ఉన్నాడో?' నాలో ఆడపిల్ల ప్రశ్నించింది. 'ఎలా ఉంటేనేం? నోర్మూయ్!' గదిమేసాను నేను - నాలో ఆడపిల్లని.

నాన్నగారు గర్వంగా చెబుతున్నారు- "అవునండి! బి. ఏ. ఫస్టు క్లాసులో పాసయింది. హిందీ విశారద పాసయింది. యమ్. ఏ. చదివిద్దామనుకొన్నాను. కాని పై ఊళ్ళో చదివించాలని ఊరుకొన్నాను. అదీకాక నాకు కొడుకు అయినా కూతురు అయినా ఒక్కతే. వదిలి ఉండలేక...."

"బి. ఏ. ఏ కాలేజిలో చదివించారండీ?" డిఫెన్సు లాయర్‌లా అడిగింది ఒక ఆడపిల్ల కంఠం. బహుశా పెళ్ళికొడుకు చెల్లెలు కావచ్చు.

"ప్రైవేటుగా చదివించి." నాన్నగారి సమాధానం.

"అదేం? ఈ ఊళ్ళో చాలా కాలేజీలు ఉన్నాయిగా?" ప్రతివాదం ఆరంభం అయింది. ఆ ప్రశ్నకి సన్నగా నా ఒంట్లోంచి వణుకు ప్రారంభం అయింది.

నాన్నగారు చెప్పబోయే జవాబు కోసం వింటున్నాను. నాన్నగారు

మాట్లాడలేదు.

అమ్మ కంఠం కలుగచేసికొంది- "ఆడపిల్ల గుమ్మం దాటడం ఆయనకు ఇష్టం ఉండదు. అంచేత ప్రయివేటుగా చదివింది."

"బాగుందండి!" అంది ఓ పెద్దావిడ కంఠం - బహుశా పెళ్ళికొడుకు తల్లి కావచ్చు.

"బి. ఏ. ఏ గ్రూపు?" గంభీరమైన అతని కంఠం. నాన్న పుంజుకొన్నాడు- "లిటరేచర్."

"వెరిగుడ్!" అంది ఆ కంఠమే.

నా ఒంట్లో వణుకు కొంచెం తగ్గింది. నుదిటిమీద చెమట పైట కొంగుతో తుడుచుకొన్నాను. ఆ తర్వాత కాఫీకప్పుల శబ్దం, బల్లలు కదిలిన శబ్దం వినిపిస్తోంది. సావిట్లో కాఫీలు త్రాగుతూ రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు.

నేను వాళ్ళు వేయబోయే ప్రశ్నలకు - జవాబులు మననం చేసుకొంటున్నాను.

"అమ్మాయిని తీసికొనిరండి. మళ్ళా వర్జ్యం రావచ్చు" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి. నేను గ్లాసులో నీళ్ళతో గొంతు తడుపుకొన్నాను. అమ్మ తెర తప్పించి, గదిలోకి వచ్చింది.

అమ్మ కేసి చూసాను. అమ్మ నాకేసి నవ్వుతూ చూసింది- "రా సుశీలా!" అంది. నేను లేచి అమ్మకేసి బేలగా చూసాను. అమ్మ నా చెయ్యి పట్టుకొంది. ఆమె చెయ్యిని పట్టుకొన్న నా చెయ్యి బిగుసుకుంది. ఆ బిగుసుకోవటంతో నా మనోభావాలు అమ్మకి వ్యక్తమయినట్లున్నాయి. నా భుజం తట్టి నా కళ్ళలోకి నవ్వుతూ చూసింది. ఆ చూపులు నాకు బలాన్ని అందించాయి.

అమ్మ సావిట్లో సోఫాలో కూర్చుండపెట్టింది. ఒక్క నిమిషం మాటలన్నీ ఆగిపోయాయి. ఆ నిశ్శబ్దతకు అర్థం నాకు తెలుసు. అన్ని జతల కళ్ళు నన్ను పరీక్షగా చూస్తున్నాయి. ఆ విషయం మెదడులోకి రాగానే కొంచెం వణుకు పుట్టింది. ఇలాంటి నిశ్శబ్దం నాకు నచ్చదు. ప్రశ్నల వర్షం ఆరంభమయింది.

"నీ పేరు ఏమిటమ్మా?"

"సుశీల."

"ఏం చదువుకున్నావ్?"

నా గురించి మా నాన్నగారు చెప్పిన వివరాలు అన్నీ విని, ఏమి తెలియనట్లు అడుగుతున్నారు. నేను చెబుతున్నాను. ఈ సమాధానాలు - నేను జవాబులు చెప్పేతీరు తెన్నులు పరిశీలించడానికి అని నాకు తెలుసు.

ప్రశ్నల వర్షం తగ్గింది. మళ్ళీ వాళ్ళు మాటల్లో పడ్డారు. బుర్ర ఎత్తి ఓరగా పెళ్ళికొడుకు కేసి చూసాను. అతను బాగానే ఉన్నాడు. సరిగ్గా అతను అప్పుడే నా కేసి చూసాడు. అతని ప్రక్కన అతని చెల్లెలు కూర్చుని ఉంది. వేరే కుర్చీల్లో పెళ్ళికొడుకు తల్లి, తండ్రి కూర్చుని ఉన్నారు. అందరి మొహాల్లో సంస్కారం ఉంది.

ఇంటర్వ్యూ అయిపోయింది. వాళ్ళు లేచారు. పెళ్ళికొడుకు చెల్లెలు చేతిలో బ్యాగు పుచ్చుకుని నిలబడింది. గోడ కేసి నడిచింది. నేను లేచి వెనక్కి తిరిగి గది వైపు నడుస్తున్నాను.

"నువ్వు అరవై అయిదులో పార్వతీపురం స్కూల్లో చదివావు కదూ?" గట్టిగా, ఆశ్చర్యంగా ప్రశ్నించింది పెళ్ళికొడుకు చెల్లెలు.

నేను వణుకుతూ వెనక్కి తిరిగాను. పెళ్ళికొడుకు చెల్లెలు చేతిలో నా చిన్ననాటి స్కూలు ఫోటో ఉంది. ఆ ఫోటో మా హెడ్ మాష్టరు పార్వతీపురం నుంచి బదిలీ అయినప్పుడు స్కూలు అంతా కలిపి తీయించుకొన్నాము. అందులో నేనూ ఉన్నాను. ఆ ఫోటో గురించి ఆమె ప్రశ్నించిన తీరుకి నా గుండెల్లో వణుకు ప్రారంభమయింది.

"నీ పేరు సుశీ కదూ? ఆ రోజుల్లో మీ నాన్నగారు అదే స్కూల్లో పనిచేసేవారు కదూ? నా పేరు పార్వతి. గుర్తు ఉన్నానా? ఒక్క సంవత్సరం ఆ స్కూల్లో చదివాను. ఆ రోజుల్లో - నువ్వు, ఇంకొక అమ్మాయి కలిపి తిరిగేవారు. ఆ తర్వాత-అమ్మాయి..." ఆగింది పార్వతి.

నేను, నన్ను పట్టుకొన్న మా అమ్మ, సోఫాల దగ్గర నిలబడ్డ నాన్న కొయ్యబారిపోయాము.

'అయిపోయింది. ఈ సంబంధం తెగిపోయింది' అన్న ఆవేదన మా ముగ్గురి మొహాల్లో కనపడుతోంది.

ఇంతలో పెళ్ళికొడుకు తల్లి కలుగచేసికొని- "అయితే ఈ అమ్మాయి నీకు తెలుసా?" అడిగింది.

"బాగా తెలుసమ్మా! నాన్నగారు పార్వతీపురంలో పనిచేసేటప్పుడు ఒక సంవత్సరం నేను, ఈమె ఒకే స్కూల్లో చదివాము. ఈ మాష్టరు ఆ స్కూల్లోనే పనిచేసేవారు. చాలకాలం అవడంవల్ల ఆయనను గుర్తుపట్టలేకపోయాను. మా యిద్దరికీ పెద్దగా స్నేహం

లేకున్నా ఈమె గురించి నాకు చాలా బాగా తెలుసు."

'చాలా బాగా' అన్న పదం ఆమె ఒత్తి పలికింది. దానికి అర్థం నాకు తెలుసు. నేను గజగజ వణికిపోయాను. ఈ అమ్మాయికి నోరు పడిపోతే- కనీసం ఈ సంబంధం అయినా కుదురుతుంది అనిపించింది నాకు.

ఆ అమ్మాయి కళ్ళు తీక్షణంగా చూస్తున్నాయి. అసహ్యంగా చూస్తున్నాయి. నేను భావించినట్లు ఆమె నోరు పడిపోలేదు. చెప్పటం మొదలుపెట్టింది-

"ఆ రోజుల్లో ఈ అమ్మాయి, ఉమ అనే మరో అమ్మాయి చాల స్నేహంగా ఉండేవారు. ఒక రోజు...."

చెప్పేస్తోంది. నేను వినలేను. విని విని చెవులు తడకలు కట్టాయి. 'ఉమా-ఉమా - ఉమా - మాయదారి ఉమ' - వినలేక చెవులు మూసుకో బోయాను.

"చాల్లే అమ్మ, నీ చిన్ననాటి ముచ్చట్లు! పెళ్ళయిన తర్వాత నువ్వు, మీ అమ్మ, వదిన కూర్చుని చెప్పుకుందురుగాని, పదండి-పదండి రైలుకి టైము అవుతోంది" అన్నాడు పెళ్ళి కొడుకు తండ్రి నవ్వుతూ.

"అదికాదు నాన్నా!" అందామె.

"పదమ్మా! రైలులో మాట్లాడుకోవచ్చు" అన్నాడాయన.

అందరూ లేచారు. "వస్తాను తల్లీ!" అన్నాడాయన.

నమస్కరించాను. పెళ్ళికొడుకు నా కేసి చూసి నవ్వాడు. దానికర్థం నా పడుచు హృదయం గ్రహించింది. అతనికి నేను నచ్చాను. పెళ్ళికొడుకు తండ్రికి నచ్చాను. లేకుంటే 'నీ వదినా నువ్వు' అని ఉండేవారు కాదు. 'భగవాన్! ఈ సంబంధం అందరికీ నచ్చింది- ఒక్క ఆ పిల్లకి తప్పించి. ఆ అమ్మాయి నన్ను గుర్తుపట్టింది. ఇప్పుడు కాకున్నా, ఇంటికెళ్ళిన తర్వాత అయినా నా నిజరూపం వారికి అర్థమవుతుంది. తెగిపోయింది, ఈ సంబంధం కూడా తెగిపోయింది. ఇక నాకు పెళ్ళి అయ్యే గీత లేదు. నా పెళ్ళి చేసి ఆనందిద్దామనుకొంటున్న తల్లిదండ్రులకు నేను సమస్య అయిపోయాను.'

ఈ సంబంధం స్థిరపడిపోయేదే కాని తెగిపోయింది. పెళ్ళివారు వీధిలోకి వెళ్ళారు. ఆ ఫోటో అందుకున్నాను. ఈ ఫోటో వలనే తెగిపోయింది. కసిగా అందుకున్నాను.

ఫోటోలో-ఉమ, నేను ప్రక్క ప్రక్కగా నిలబడ్డాము. ఫోటోలో ఉన్న ఉమ నా కేసి చూసి నవ్వు తోంది. ఆ నవ్వుకి అర్థం నాకు తెలుసు.

'అవును-ఉమని నేను చంపే సాను. కాని ఉమ నన్ను ప్రతి క్షణం చంపుతోంది. పదమూడేళ్ళ క్రితం పదేళ్ళ ఉమ అనే అమ్మా యిని సుశీల అనే అమ్మాయి చంపేసింది. ఈ విషయం ప్రజలు మర్చిపోరా? జరిగినదేమిటో వాళ్లు తెలుసుకోరా?'

ఆ రోజు ఆగస్టు పదిహేను. స్కూల్లో సాయంత్రం సమావేశం. ఆ రోజు సభకు కలక్టర్‌గారు సతీ మణిగారితో సహా వచ్చారు. సభ మొదట్లోనే నేనూ, ఉమ-వేదిక ప్రక్కగా పలబడ్డాము.

కలక్టర్‌గారి భార్యకు దండ నన్ను వేయమని చెప్పారు హెడ్ మాష్టారు. అందుకే వేదిక ప్రక్కగా నిలబడ్డాను. నా ప్రక్కన ఎప్పుడూ నాతో తిరిగే ఉమ నిల బడి ఉంది. ఇంతలో నన్ను ఎవరో పిలిస్తే ప్రక్కకి వెళ్ళాను.

నేను మళ్ళా వేదిక దగ్గరకు వచ్చేసరికి ఉమ మేడమీద ఉన్న హెడ్‌మాష్టరు రూము కేసి వెళు తోంది. వెనక నేను పరుగుపెట్టి-

"ఉమా! ఎక్కడికి?" అడి గాను.

"హెడ్‌మాష్టరు రూములో దండ ఉందిట. అది తెచ్చి నన్ను కలక్టరుగారి భార్యకు వేయమన్నారు. ఇదిగో తాళాలు - వెళుతున్నాను" అంటూ తాళాలు చూపించి పరుగు తీసింది ఉమ. నేనూ వెనకాల పరుగుపెట్టాను.

ఆమె తాళాలు తెరిచి గర్వంగా నా కేసి చూసి దండ బయటున్న బల్ల మీద ఉంచి తాళాలు తిరిగి వేస్తోంది.

ఉమ నన్ను కాదని దండవేయ బోతోందని కోపం వచ్చి బల్లమీద ఉన్న దండ తీసికొని పరుగు పెట్టేను. ఉమ వెనకాలే పరుగెత్తు కుంటూ వచ్చింది. మెట్లుకేసి పరుగు పెట్టాను. ఉమ కేకలు పెడుతూ వచ్చి నా భుజం పట్టుకొని- "దండ ఇటుతే, నన్ను వేయమన్నారు" అంది.

"హుం-ముందు నన్నే వేయ మన్నారు" అన్నాను నేను.

ఇద్దరం పై మెట్టుమీద ఉన్నాం. అకస్మాత్తుగా ఉమ నా చేతిలో దండ లాక్కొని మెట్లు దిగటం ఆరంభించింది. అందుకే- సగం దండ ఆమె చేతిలోకి రావడం. క్షణంలో ఆమె జారి మెట్లుమీంచి

క్రిందపడటం జరిగిపోయింది.

క్రింద ఉమ శవం! ఆ శవం మీద సగం తెగిన పూలదండ పడి ఉంది. కెవ్వున కేకవేశాను.

ఆ తర్వాత పోలీసులు రావటం, నన్ను ప్రశ్నలు అడగటం, ఉమ తల్లిదండ్రులు నన్ను తిట్టడం, ఊళ్ళో 'కిల్లర్' అని పిలవటం జరిగిపోయింది. ఆ తర్వాత పార్వతీ పురం వదిలి విజయనగరం వచ్చినా, నాతోపాటు 'కిల్లర్' అనే పేరు ఈ ఊరూ వచ్చింది. నేను స్కూల్లో కాక ప్రైవేటుగా చదవడం జరిగింది. సంఘటన పాతబడినా జనం దాన్ని మర్చిపోవడం లేదు. 'ఈ సుశీల ఉమని చంపేసింది!' అదే జనం గోల.

క్షణంలో ఆలోచనలతో గతం నా కళ్ళముందు కదిలింది. ఫోటో చేతిలో వణుకుతోంది. ఫోటోని బల్లమీద పెడుతూ చూసాను. పార్వతి చేతిబ్యాగు టేబిల్‌మీద వదిలేసింది.

ఆ బ్యాగ్ తీసుకొని వీధి వరం డాలోకి వచ్చాను.

నేను ఆలోచిస్తున్నాను. వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఆమెను పిలుద్దా మనుకొన్నాను. ఇంతలో వాళ్ళు జంక్షన్ వరకూ వెళ్ళిపోయారు. ఇరవై గజాల దూరంలో ఉన్నారు.

ఇంతలో ఎర్రచీర కట్టుకొన్న అమ్మాయి వెనక్కి వస్తోంది. అవును ఆ అమ్మాయి పార్వతి, సందేహంలేదు. బ్యాగు గురించి వెనక్కి వస్తోంది. మిగిలిన వాళ్ళు రిక్షాలు మాట్లాడుతున్నారు. వస్తోంది పార్వతి. 'పార్వతిని బ్రతిమాలు కుంటే?' నా పిచ్చిగాని వాళ్ళవాళ్ళకి చెప్పకుండా ఉంటుందా? నా గురించి తెలిసిన తర్వాత 'మీ సంబంధం మాకు నచ్చలేదు' అంటూ ఉత్తరం రాస్తారు.

రోడ్డుకేసి చూస్తున్నాను. ఎర్ర చీర నాకు దగ్గరవుతోంది. నేను కూడా రెండు అడుగులు ముందుకు వేసాను. గుమ్మం దిగాను. ఆమె బ్యాగుకేసి చూస్తూ నడిచి వస్తోంది. కుడిప్రక్కకు చూసిన నేను త్రుళ్ళి పడ్డాను. అటునుంచి వేగంగా లారీ వస్తోంది. మరో పది అడుగులు వేస్తేకాని పార్వతికి లారీ కనబడదు. ఈ లోపుగా పార్వతిని లారీ గుద్దే స్తుంది. నా గుండె జల్లుమంది.

'పార్వతీ! లారీ' అని గొంతెత్త బోయాను. ఒక్కక్షణం నా స్వార్థం నా గొంతు నొక్కేసింది. 'పార్వతి లేకుంటే నీ రహస్యం పొక్కదు-' స్వార్థం ప్రలోభపరిచింది. నేను స్వార్థం గొంతు నొక్కడానికి కొన్ని సెకనులు పట్టింది. ఆ కొన్ని

సెకనులలో లారీ కొన్ని గజాలు, పార్వతి కొన్ని అడుగులు ముందుకు రావడం జరిగింది.

ఇక నేను అరిచినా పార్వతి గ్రహించే వేళకి ఆలస్యం జరగ వచ్చు-అనిపించింది నాకు. క్షణంలో ముందు కురికాను. రోడ్డుకి అడ్డం పడి పరుగు పెట్టాను. పార్వతిని ప్రక్కకు తోసాను. లారీ బంపర్ నా నడుంకి తగిలింది. విసురుగా పడ్డాను. తల దిమ్మెక్కిపోయింది. అంతే! ఆ తర్వాత ఏమైందీ నాకు తెలియదు.

* * *

కళ్ళు విప్పాను. నేను హాస్పిటల్‌లో ఉన్నానని, నా తల చుట్టూ బ్యాండేజి కట్టారని గ్రహించుకోవ టానికి కొద్దిసేపు పట్టింది. తల దిమ్ముగా ఉంది. ఎదురుగా అమ్మా-నాన్నా కళ్ళనీళ్ళతో నిలబడిఉన్నారు.

"అమ్మా, సుశీలా! ఎలాఉంది?" అడిగారు నాన్నగారు.

"మీరు ఆమెను కలవర పెట్టకండి" అంది నర్సు.

నర్సుకేసి చూసాను. నర్సు ప్రక్కగా పార్వతి నిలబడి ఉంది. ఆశ్చర్యపోయాను.

"నీకు దెబ్బలు తగిలాయా?" పార్వతిని అడిగాను.

"లేదు. పాపం నా గురించి నువ్వు దెబ్బ తిన్నావు" అంది పార్వతి. ఆమె కళ్ళలో నాపట్ల వాత్సల్యం ఉంది. ఆనందంతో నా కళ్ళు చమర్చాయి.

"క్షమించండి! అందరూ బయటికి నడవండి" నర్సు బలవంతంగా అందర్నీ పంపి తలుపు మూసింది. మళ్ళీ తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. గుమ్మంలో పార్వతి అన్న-పెళ్ళికొడుకు.

"మీరు యింకా ఉన్నారా? నేను కిల్లర్‌నని పార్వతి చెప్పలేదా?" నెమ్మదిగా అడిగాను.

అతనునవ్వి-"పార్వతిచెప్పింది. ఎప్పుడోజరిగింది చెప్పింది. కాని నా కళ్ళ ముందు జరిగింది చూసాను. లేకుంటే రత్నాన్ని రాయని భ్రమ చెందేవాణ్ని. నా ఒక్కగానొక్క చెల్లెలిని కాపాడిన కృతజ్ఞతతో చెప్పటం లేదు-ముందే నువ్వునాకు నచ్చావు. నేను మధ్యాహ్నం ఊరు వెళుతున్నాను. నువ్వు పూర్తిగా కోలుకున్న తర్వాత ముహూర్తాలు పెట్టుకుందాం" అన్నాడతను.

నా చెవుల్లో యిప్పుడే మంగళ వాయిద్యాలు వినపడుతున్నాయి. *